రెవెన్యూ అధికారుల లీలలు!

- భూమి లేకున్నా ఉన్నట్లు చూపుతున్న వైనం
- డబ్బు ముట్టనిదే సర్వే గొలుసు పట్టని సిబ్బంది
- ఆలయాల భూముల ఆక్రమణకు సహకారం, బ్యాంకుల్లో తాకట్టు
- అక్రమంగా డీ.పట్టాల తయారు
- భూములు లేకున్నా ఖాతా నంబర్ల సృష్టి
- లబోదిబోమంటున్న బాధితులు

కాసుల కోసం భూమి లేకున్నా ఉన్నట్లు రికార్డులను సృష్టించడం.. ఉన్న భూముల రికార్డులు మార్చి సాగులో లేరని చెప్పడం.. భూములు లేకపోయినా ఖాతా నంబర్, ఆన్‌లైన్‌లో 1బి, అడంగల్ చేర్చడం.. ఆలయాల భూములను బ్యాంకుల్లో పెట్టి రుణాలు పొందటం, డి.పట్టాలను సృష్టించడం ఇక్కడి రెవెన్యూ అధికారులకు వెన్నతో పెట్టిన విద్య. చివరకు చేయి తడపనిదే సర్వే గొలుసు కూడా పట్టరనే విమర్శలున్నాయి. వీరి అక్రమాలతో బాధిత రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ఏళ్లుగా తిరుగుతున్నా న్యాయం జరగడం లేదు. – ఆలూరు


హొళగుంద తహసీల్దార్ కార్యాలయం


హొళగుంద తహసీల్దార్ కార్యాలయం నుంచి అనధికారికంగా రికార్డులను తీసుకెళ్తున్న పాండు (ఫైల్)

హొళగుంద మండలంలో మునుమానుగుంది గ్రామానికి చెందిన చంద్రశేఖర్,పార్వతమ్మ, మంజునాథ్‌కు పూర్వికుల నుంచి సర్వే 424–ఏ లోని 1.47 ఎకరాలు సంక్రమించింది. అయితే ఆర్‌ఐ దినోజ్ రాజశేఖరన్ కాసులకు కక్కుర్తిపడి 0.50 సెంట్లు ఇతరులకు విక్రయించినట్లు, మిగిలిన 0.94 సెంట్లు తన అన్న కుమారుడి పేరున ఆన్‌లైన్‌లో మార్చారని బాధితులు వాపోయారు. పలుమార్లు వినతి పత్రాలు అందజేసి సమస్య పరిష్కరించాలని కోరినా పట్టించుకోకపోవడంతో ఇటీవల ఆర్‌ఐని కార్యాలయం బయటకు లాక్కొచ్చి నిలదీశారు. అలాగే..అదే గ్రామంలోని 104 సర్వే నంబర్‌లోని 4.20 ఎకరాల భూమిన కొందరు అన్యాయంగా సాగు చేస్తున్నారని బాధితులు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం.

☛ ఆలూరు మండలంలోని మొలగవెల్లి గ్రామంలో సర్వేనంబర్ 864 ఎఫ్ 19.50 ఎకరాలు చిత్తారి హరికృష్ణ తండ్రి చిత్తారి హరేకృష్ణ , 894–బిలో సిరియ శ్రీనివాసులు తండ్రి ఎర్రిస్వామి వ్యవసాయ భూమిని గుట్టుగా ఆన్‌లైన్‌లో మార్చడంతో బాధితుల ఫిర్యాదు మేరకు వీఆర్వో సురేష్, అప్పటి తహసీల్దార్ హుసేన్‌పీరాను జిల్లా అధికారులు సస్పెండ్ చేశారు.

☛ హత్తిబెళగళ్ సమీపంలోని అగ్రహారంలో అర్థగేరి గ్రామానికి చెందిన వెంకట లక్ష్మమ్మ /రెడ్డి పేరున సర్వేనంబర్ 1365లో 9.28 ఎకరాలు ఖాతా నంబర్ 5466ను కురుకుంద జయవర్ధన్ /తండ్రి ఈరన్న పేరున అక్రమంగా మార్చారు.

☛ అగ్రహారంలో 144 సర్వే నంబర్ బోయ లక్ష్మి వీరేష్ పేరున 10 ఎకరాల భూమి లేకున్నా 1625 ఖాతాను నంబర్ కేటాయించారు. సర్వే నంబర్‌లో 1433 ఎఫ్‌లో 2.40 ఎకరాలు పట్టాలో భూమి ఉండగా మరో 2.50 ఎకరాలను కలిపి 5 ఎకరాలు ఉన్నట్లు 2168 ఖాతాను రెవెన్యూ అధికారులు కేటాయించారు.

ఇవన్నీ కేవలం కొన్ని ఉదాహరణలు మాత్రమే

ఇలాంటి అక్రమాలు కోకొల్లలుగా ఉన్నాయి. భూ సమస్యలపై బాధితులు నిత్యం ఆయా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదు సరికదా.. వారి పేరున ఉండే భూమిన వారికి తెలియకుండా కాసులకు కక్కుర్తి పడి మరొకరి పేరుమీద చేర్చి సమస్యలను మరింత జటిలం చేస్తున్నారు. ఎవరైనా నిలదీస్తే వారి భూ సమస్య ఎన్నటికీ పరిష్కారం కాకుండా ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఇటీవల హొళగుంద ఆర్‌ఐ దినోజ్ రాజశేఖరన్ తీరుతో విసుగు చెంది ప్రజలు కార్యాలయం నుంచి బయటకు లాక్కొచ్చి బట్టలు చించి కొట్టినంత పనిచేశారు. చివరకు ఉన్నతాధికారులు స్పందించి సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు. కాగా.. ఈ ఆర్‌ఐ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి వివాదాస్పదుడిగా, ఇప్పటికే ఓ సారి సస్పెండ్ కూడా అయ్యాడు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు తీరు మార్చుకొని తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

☛ ఆస్పరి మండలం యాటకల్లు గ్రామంలో 307/1 సర్వే నంబర్‌లో 15.7400 ఎకరాలు ఉలవ గిడ్డమ్మపేరిట ఉంది. ఇందులో ఆమె భర్త చంద్రబాబుకు 2.50 ఎకరాల భూమికి సంబంధించిన 813 ఖాతాను రెవెన్యూ అధికారులు మంజూరు చేసి ఈ భూమికి 12 ఏళ్ల క్రితం పట్టా అందజేశారు. అయినా ఉలువ గిడ్డమ్మ సాగులో లేదని కొందరు తన భూమిని ఆక్రమించుకున్నారని, సర్వే చేయాలని కోరినా పట్టించుకోవడంలేదని ఆమె వాపోతోంది.

☛ హొళగుంద వద్ద 573 సర్వే నంబర్‌లో 75 సెంట్లు, 574/ 2 సర్వేనంబర్‌లో 1.75 ఎకరాల భూమిని మేకల భాగ్యలక్ష్మి, భర్త గోపాలుడు పేరున ఖాతా నంబర్ 1226 పట్టాను మంజూరు చేశారు. వీరు కొన్నేళ్ల నుంచి సాగులో ఉన్నారు. అయితే ఈ ఏడాది కొందరు ఆ భూమి సాగు చేయరాదని బెదిరించారు. దీంతో బాధితులు రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోయింది.

☛ మండల కేంద్రం చిప్పగిరిలో శ్రీ భోగేశ్వర స్వామికి (చెన్నకేశవస్వామి) చెందిన ఇనామ్ భూమి సర్వే నంబర్ 145/1ఏ లో 14.15 ఎకరాలు, 145/సి లో 23.08 ఎకరాలు 308లో 20.17 ఎకరాల భూమిని కౌలు తీసుకున్న కొందరు కొన్నేళ్ల శిస్తు చెల్లించడం లేదు. దీనిపై గ్రామస్తులు దేవదాయ శాఖ అధికారులు పలుమార్లు ఫిర్యాదు చేశారు.

☛ హాలహర్వి మండలంలో..112 సర్వే నంబర్‌లో 15.14 ఎకరాలు, 142 సర్వే నంబర్‌లో 5.5 ఎకరాల ఆంజనేయస్వామి ఆలయ భూమిని కొందరు అనుభవిస్తున్నారు.

☛ గూళ్యం గ్రామంలోని 128 సర్వే నంబర్‌లోని 10.58 ఎరాలను శ్రీ కాడ సిద్ధేశ్వరస్వామి ఆలయ భూమి. సర్వే నంబర్ 36లో 16.7 ఎకరాలు హంపి విరుపాక్ష్యయ్యస్వామి భూమికి కనీసం శిస్తు చెల్లించకుడా కొందరు దౌర్జన్యంగా ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు.

☛ హొళగుంద మండల కేంద్రంలో 138 సర్వే నంబర్‌లోని 27.14 ఎకరాలు ఆంజనేయస్వామికి చెందిన భూమి కాగా, 157 సర్వే నంబర్ 18.9 ఎకరాలను ఉరువకొండ స్వామికి చెందినది. 160 సర్వే నంబర్‌లోని 9.14 ఎరాల భూమిని కూటమి నేతలు అక్రమంగా సాగు చేస్తున్నారనే ఆరోపణలున్నాయి.

ఫిర్యాదులపై విచారణ చేస్తాం

వ్యవసాయ, వ్యసాయేతర భూముల అక్రమాలు, అధికారుల అవినీతిపై ఫిర్యాదులు చేస్తే సక్రమంగా విచారణ జరిపిస్తాం. గతంలో జరిగిన సంఘటనలపై నాకు అంతగా తెలియదు. వారం రోజుల క్రితం బాధ్యతలు తీసుకున్నా. కింది స్థాయి సిబ్బంది తప్పులు చేస్తే మొత్తం రెవెన్యూ శాఖకు చెడ్డపేరు వస్తుంది. అక్రమాలను నిరోధించేందుకు ఉన్నతాధికారుల సహాయంతో చర్యలు తీసుకుంటాం.

– గోవింద్ సింగ్, ఆలూరు తహసీల్దార్

క్లుప్తంగా

లక్ష్యాలను అధిగమించాలి


మాట్లాడుతున్న సుధాకరరెడ్డి

తుగ్గలి : వికసిత్ ఏపీ –2047ను లక్ష్యసాధన దిశగా అధికారులు పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి సుధాకరరెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వికసిత్ ఏపీ–2047 ప్రణాళికపై అవగాహన కల్పించారు. ఆయా శాఖల అధికారులు ప్రణాళికలు తయారు చేసుకొని ప్రతిపాదించిన లక్ష్యాలను అధిగమించాలని సూచించారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ సావిత్రి, ఇన్‌చార్జ్ ఈవోఆర్డీ గోపాల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హనుమంతు, ఏపీఓ రామకృష్ణ, ఎంఈఓ–2 రామవెంకటేశ్వర్లు, వైద్యాధికారులు ప్రవీణ్, హరిత, ఐసీడీఎస్, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఆస్పరి కూరగాయల మార్కెట్ వేలం


వేలం నిర్వహిస్తున్న దృశ్యం

ఆస్పరి: స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో గురువారం సర్పంచ్ మూలింటి రాధమ్మ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి జంప్లానాయక్ ఆస్పరి దినసరి కూరగాయల మార్కెట్‌కు ఏడాది పాటు హక్కు కోసం బహిరంగ వేలం నిర్వహించారు.వేలంలో గ్రామానికి చెందిన ఐదుగురు పోటీపడగా కట్టెల లక్ష్మీనారాయణ రూ. 65 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాది మార్కెట్ వేలం రూ.56 లక్షలకు పలికింది. దీంతో రూ.9లక్షలు పంచాయితీకి ఆదాయం వచ్చింది. వేలంలో జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, కేడీసీసీ బ్యాంకు జిల్లా మాజీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, ఉప సర్పంచ్ వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన


అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా,చిత్రంలో ఎస్పీ బిందు మాధవ్

పత్తికొండ (ఆళ్లగడ్డ) : ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 31వ తేదీ పత్తికొండ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పత్తికొండ మండలం పుచ్చకాలయమడ గ్రామంలో జరిగే పింఛన్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు స్వయంగా పింఛన్ అందజేస్తారని అధికారులు తెలిపారు. ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ బిందు మాధవ్, ఎమ్మెల్యే కెయి శ్యాంబాబు తదితరులు గ్రామానికి చేరుకుని క్షేత్రస్థాయిలో పర్యటించి హెలిప్యాడ్, గ్రౌండ్, సభ వేదిక, భద్రత పరమైన ఏర్పాట్లను పరిశీలించారు.

నేలతలమరిలో స్పెషల్ ఫీవర్ సర్వే


రక్త నమూనాలను సేకరిస్తున్న వైద్య సిబ్బంది

దేవనకొండ:మండలంలోని నేలతలమరి గ్రామంలో దేవనకొండ పీహెచ్‌సీ సబ్ యూనిట్ ఆఫీసర్ సాయిబాబా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది గురువారం స్పెషల్ ఫీవర్ సర్వే రెండో దశ కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ జ్వరం వచ్చిన వారికి రక్త నమూనాలు సేకరించి వాటిని దేవనకొండ పీహెచ్‌సీ ల్యాబ్‌కు పంపించారు. ఇందులో ఎవరికైనా మలేరియా, డెంగీ ఉన్నట్లు తేలితే వారికి వెంటనే వ్యాధికి సంబంధించిన చికిత్స అందిస్తామని చెప్పారు. టైఫాయిడ్ ఉన్న వారికి కూడా పరీక్షలు నిర్వహించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

15లోపు ఈ-క్రాప్ నమోదు చేయించుకోండి

హొళగుంద: ఖరీఫ్‌లో భాగంగా సాగు చేసిన ప్రతి పంటను రైతులు వచ్చే నెల 15వ తేదీ లోపు తప్పనిసరిగా ఈ–క్రాప్ నమోదు చేయించుకోవాలని ఏఓ ఆనంద్ లోకదళ్ రైతులకు సూచించారు. గురువారం చిన్నహ్యాట గ్రామ పంచాయతీ పరిధిలోని పొలాల్లో వీఏఏలు చేస్తున్న పంట నమోదు ప్రక్రియను పరిశీలించారు.ఆయా రైతు సేవా కేంద్రాల్లో రైతులు వీఏఏలను కలిసి ఈ–క్రాప్ బుకింగ్, ఈ–కేవైసీ తప్పని సరిగా చేసుకోవాలని చెప్పారు. ఏఈఓ విరుపాక్షి, వీఏఏ తస్లీమా ఉన్నారు.

హాస్టళ్లను ఏర్పాటు చేయాలి

దేవనకొండ: మండల కేంద్రంలో ప్రభుత్వ బీసీ బాలుర, బాలికల హాస్టళ్లను ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఎఫ్ మండలాధ్యక్ష కార్యదర్శులు మధు, భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం దేవనకొండకు వచ్చిన ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇజాజ్, రాజశేఖర్ పాల్గొన్నారు.

30 మినీ గోకులాలకు 150 దరఖాస్తులు

మద్దికెర : మండలంలోని గ్రామాల్లో 5 ఎకరాల లోపు ఉన్న రైతులకు స్వయం ఉపాధి కల్పించే దిశగా చేపట్టిన మండలానికి 30 మినీ గోకులాలు మంజూరు చేసిందని వాటి కోసం 150 దరఖాస్తులు వచ్చినట్లు పశు వైద్యాధికారి కృష్ణానాయక్ గురువారం తెలిపారు. వచ్చిన దరఖాస్తులను ఆన్‌లైన్ చేశామని మంజూరైన వెంటనే లబ్ధిదారులు పనులు మొదలుపెట్టాల్సి ఉంటుందని చెప్పారు.

విజయవంతం చేయండి

ఆలూరు రూరల్: విద్యా,వైజ్ఞానిక తరగతులు,జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ తాలూకా కార్యదర్శి మునిస్వామి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ప్రభుత్వ బాలుర–2 పాఠశాల ఆవరణలో వైజ్ఞానిక తరగతుల పోస్టర్లను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై సెప్టంబర్ 2 నుంచి 5వ తేదీ వరకు అనంతపురం జిల్లాలో పీడీఎస్‌యూ (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) ఆధ్వర్యంలో జనరల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానాన్ని అమలు చేస్తూ విద్యా వ్యవస్థను ప్రైవేటీకరణ చేసేందుకు సిద్ధమైందన్నారు. ఉపాధ్యక్షుడు వెంకటేష్, హనుమేష్, మధు, సాయి, ఈశ్వర్,నాగరాజు, రవి పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎస్ఎంసీ ఎన్నికలు

హొళగుంద: మండలంలో వాయిదా పడిన ఎల్లార్తి జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చైర్మన్‌గా బోయ లక్ష్మి, వైస్ చైర్మన్‌గా హరిజన మహేష్, ప్రాథమిక పాఠశాల చైర్మన్‌గా మాల లక్ష్మికాంత్, వైస్ చైర్మన్‌గా నాగవేణి ఎన్నికయ్యారు. ఎస్ఐ బాల నరసింహులు బందోబస్తు చేపట్టారు. ఎంఈఓలు సత్యనారాయణ, జగన్నాథం, హెచ్ఎం శివశంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్‌కు నివాళి

తుగ్గలి : హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని గురువారం పెండేకల్లు రైల్వే జంక్షన్, తుగ్గలి, పగిడిరాయి జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంలు నరేంద్ర, బాబురావు, గిడ్డమ్మ, ఫిజికల్ డైరెక్టర్లు పాండురంగ రాజు, చందునాయక్, వేణు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు.

ఆలూరు రూరల్: స్థానిక ప్రభుత్వ బాలుర–2 ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడాదినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం ధనలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం అన్నారు. విద్యార్థులు ఆటల పోటీల్లో ప్రతిభ చూపాలన్నారు. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన శ్రీనివాసులు,రవి కుమార్ అనే ఉద్యోగులను సన్మానించారు.


పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్ఎస్‌లో ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆలూరు: ఎల్లార్తి రోడ్డు సమీపంలోనున్న శ్రీ వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి నివాళులర్పించారు.

యువకుడిపై కత్తితో దాడి

ఆలూరు రూరల్: యువకుడిపై కత్తితో దాడి చేసి గాయపరిచిన సంఘట గురువారం సాయంత్రం ఆలూరులో జరిగింది. పోలీసులు,బంధువులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న వీరేష్ సాయంత్రం రోడ్డుపై వెళ్తూ ఎస్సీ కాలనీ సమీపంలో ఉన్న రంగయ్యను పలకరించాడు. దీంతో రంగయ్య ఇంట్లో ఉన్న కత్తితో ఒక్క సారిగా వీరేష్‌పై దాడి చేశాడు. దాడిలో వీరేష్ తలకు,ఎడమ చేతికి తీవ్రగాయాలయ్యాయి. బంధువుల ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వీరేష్‌ను ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు రంగయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వీరేష్

మండల అభివృద్ధే లక్ష్యం


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీపీ మిద్దె రంగడు

వెల్దుర్తి: వైఎస్సార్‌సీపీ పాలనలో మండలంలో నెలకొన్న సమస్యలు, మండలాభివృద్ధికి కృషి చేశామని, ప్రస్తుతం కూడా అదే తీరును కొనసాగిస్తామని ఇన్‌చార్జ్ ఎంపీపీ మిద్దె రంగడు, జెడ్పీటీసీ దాదిపోగు సుంకన్న అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శివమల్లేశ్వరప్ప ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ ఈనెల 31న పింఛన్ పంపిణీ చేస్తామని చెప్పారు. మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలని జెడ్పీటీసీ సభ్యుడు సంబంధిత అధికారులకు నివేదించారు. ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బొమ్మన రవిరెడ్డి, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, కోఆప్షన్ మెంబర్ మాలిక్‌బాషా హాజరయ్యారు.

పథకాల అమలులో చంద్రబాబు విఫలం


దేవనకొండలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

దేవనకొండ: ప్రజలకు ఉత్తుత్తి హామీలు ఇచ్చి గద్దె నెక్కిన సీఎం చంద్రబాబునాయుడు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆలూరు ఎమ్మెల్యే బి.విరూపాక్షి విమర్శించారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన ఓ వివాహ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని టీడీపీ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని మండిపడ్డారు. పథకాల పేరుతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చి రెండు నెలలైనా ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా నిర్వహించడం లేదన్నారు. జెడ్పీటీసీ రామకృష్ణ, మండల కన్వీనర్ తపాలశ్రీను, నాయకులు దివాకర్‌నాయుడు, ఎమ్మెల్యే సోదరుడు వెంకటేష్ పాల్గొన్నారు.

బెల్లం ఊట ధ్వంసం

తుగ్గలి : నాటుసారా స్థావరాలపై తుగ్గలి పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. అందించిన సమాచారం మేరకు ఎస్ఐ కృష్ణమూర్తి తన సిబ్బందితో వెళ్లి రాంపల్లి చెరువు సమీపంలోని బొగ్గుల గుట్ట వద్ద నాటుసారా బట్టీలపై దాడులు చేసి వెయ్యి లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, 5లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. సారా తయారు చేసినా, విక్రయాలు జరిపినా కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.


రాంపల్లి వద్ద బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

ఎల్లార్తి దర్గాల్లో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు

హొళగుంద: ఎల్లార్తి గ్రామంలో వెలిసిన షేక్షావలి, షాషావలి దర్గాలను గురువారం భక్తులు దర్శించుకుని భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పాతెహాలు నిర్వహించారు. దర్గాలో మొక్కులు చెల్లించుకోవడానికి జిల్లా నుంచే కాకుండా కర్ణాటక, తెలంగాణ తదితర దూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ప్రత్యేక ఫాతెహాల్లో పాల్గొని స్వామి వార్లకు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే హొళగుంద సాయిబన్న, చిణిగితాతా దర్గాలు, షిర్డిసాయిబాబా ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి

ఆస్పరి: వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటును విరమించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రస్తుత సీఎం చంద్రబాబు వ్యతిరేకించారని, అధికారంలోకి వచ్చిన వెంటనే వాటి ఏర్పాటును కొనసాగించేందుకు పూనుకోవడం సరి కాదన్నారు. విరుపాక్షి, కృష్ణమూర్తి, అంజినయ్య, ఉరుకుందప్ప పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కృష్ణగిరి: పెద్దొడ్డి గ్రామంలో ఆంజనేయస్వామి పండుగ సందర్బంగా శుక్ర, శనివారాల్లో రెండు రోజులు జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు సురేష్, హరికృష్ణ గురువారం తెలిపారు. పోటీలను గ్రామస్తుల సహకారంతో నిర్వహిస్తున్నామని, గెలుపొందిన జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.10వేలు, రూ.7వేలు, రూ.4 వేలు, రూ.2వేలను అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే వారు ఉదయం 9 గంటలలోపు రూ.300 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని, వివరాలకు సెల్ 9505814660, 7287045826 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

హొళగుందలో మోస్తరు వర్షం

హొళగుంద: మండలంలో గురువారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. కొద్ది రోజులుగా అడపదడపగా కురిసిన వర్షానికి భూమిలో తేమ కొనసాగుతోంది. ఆశాజనకంగా కురుస్తున్న వర్షాల వల్ల ప్రస్తుతం పంటలు బాగున్నాయని అయితే వర్షాలు ఎక్కువైతే సాగైన మిరప, పత్తి తదితర పంటలు దెబ్బతిని భారీగా నష్టపోతామని రైతులు తెలిపారు. ఇక ఎల్లెల్సీ కింద వరిసాగు దాదాపు పూర్తికావొస్తోంది.

రక్తదానం

హొళగుంద: మండలంలోని హెబ్బటం గ్రామానికి చెందిన హుసేన్‌పీరా డీఎస్సీకి ప్రిపేర్ అవడానికి భీమిలిలో కోచింగ్ తీసుకుంటూ సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నాడు. గురువారం భీమిలిలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశాడు. తనతో పాటు కోచింగ్ సెంటర్‌లోని విద్యార్థులకు అవగాహన కలిగించి రక్తదానంలో పాలు పంచుకునేలా చేశాడు. గురువారం నిర్వహించిన శిబిరంలో 60 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారని చెప్పారు.

దేశ భాషలందు తెలుగు లెస్స


మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్


శ్రీకృష్ణదేవరాయలు, అష్టదిగ్గజ కవుల వేషాధారణలో ఆస్పరి కస్తూర్బా విద్యార్థినులు


తుగ్గలి జెడ్పీహెచ్ఎస్‌లో గిడుగు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

ఆలూరు రూరల్: దేశ భాషలందు తెలుగు లెస్స అని ఆలూరు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్ఞానేశ్వర్ అన్నారు. గురువారం స్థానిక కళాశాలలో తెలుగు అధ్యాపకులు డా. రాఘవేంద్ర ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు.వారు మాట్లాడుతూ దేశంలో అధికారిక గుర్తింపు కలిగిన 22 భాషల్లో తెలుగు భాష ఒకటి. తెలుగు భాషకు మూలం ద్రవిడ భాష అన్నారు. 1966లో తెలుగు భాషను రాష్ట్ర అధికారిక భాషగా ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గిడుగు రామ్మూర్తి వాడుక భాషను సామాన్యులందరిని చేర్చి తెలుగు సాహిత్యాన్ని సరళీకరించారన్నారు. ఆయన విశిష్ట సేవలను గుర్తించి గిడుగు రామ్మూర్తి జయంతి నాడు తెలుగు భాషాదినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వివరించారు. అధ్యాపకులు మాధవి, సుశీల,లక్ష్మీనరసమ్మ, ముద్దప్ప, రికార్డ్ అసిస్టెంట్ శేఖర్, ప్రణయ్ పాల్గొన్నారు.

ఆస్పరి: స్థానిక కస్తూర్బా పాఠశాలలో గురువారం జాతీయ క్రీడాదినోత్సవం, తెలుగు భాషాదినోత్సవాన్ని ప్రిన్సిపాల్ శారూన్ స్మైలీ ఆధ్వర్యంలో విద్యార్థినులు ఘనంగా జరుపుకున్నారు. గిడుగు రామ్మూర్తి పంతులు, ధ్యాన్ చంద్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జాతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్, తెలుగు బాషా అభివృద్ధికి కృషి చేసిన కవి గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు గురించి విద్యార్థినులకు వివరించారు. విద్యార్థినులు శ్రీకృష్ణ దేవరాయలుతో పాటు అష్టదిగ్గజ కవుల వేషాధారణ ఆకట్టుకుంది.

వెల్దుర్తి: తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి 161వ జయంతి పురస్కరించుకుని గురువారం స్థానిక సత్యసాయి హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కరెస్పాండెంట్ జివి రమణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో హెచ్ఎం గఫూర్, తెలుగు ఉపాధ్యాయులు మీసాల రఘు, రేష్మ తెలుగు భాష గొప్పతనాన్ని వివరించారు.

అమృత భాష తెలుగు

తుగ్గలి : వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా గురువారం పత్తికొండ, తుగ్గలి మండలాల్లోని పాఠశాలల్లో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు గిడుగు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెలుగు భాష ఆవశ్యకత, ప్రాముఖ్యతను హెచ్ఎంలు విద్యార్థులకు వివరించారు. మృతృభాషపై ప్రేమ కలిగేలా తల్లిదండ్రులు చిన్నారులను ప్రోత్సహించాలన్నారు. అనంతరం తెలుగు పండితులను సన్మానించారు.

దేవనకొండ: స్థానిక జెడ్పీ పాఠశాలతో హెచ్ఎం మద్దిలేటి ఆధ్వర్యంలో గురువారం తెలుగుభాషా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా గిడుగు రామ్మూర్తి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మఠం నిర్మాణానికి భూమి పూజ

హొళగుంద: మండలంలోని పెద్దహ్యాట గ్రామానికి చెందిన భక్తులు గురువారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి మఠం నిర్మాణానికి భూమిపూజ చేశారు. సుళువాయి రోడ్డులోని దోని భీమప్ప గారి మనవడు మారెప్ప పొలంలో స్వామి మఠం నిర్మించేందుకు చర్యలు చేపట్టారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

వెల్దుర్తి: అధిక వర్షాల వల్ల నష్టపోయిన పచ్చి మిర్చి రైతులకు నష్ట పరిహారం అందించి, దిగుబడులకు గిట్టుబాటు ధర కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం మండల కార్యదర్శి టి.కృష్ణ, రైతు సంఘం కార్యదర్శి సాంబశివుడు డిమాండ్ చేశారు. గురువారం రామళ్లకోట గ్రామంలో పచ్చి మిర్చి మార్కెట్ యార్డు వద్ద రైతులతో కలిసి మాట్లాడారు. వారు మాట్లాడుతూ మండలంలో రామళ్లకోట, బోయనపల్లె, నరసాపురం, కలుగొట్ల, రత్నపల్లె, సిద్దినగట్టు, బుక్కాపురం తదితర గ్రామాలలో పచ్చి మిర్చి ఎక్కువగా పండిస్తున్నారని, ఎకరాకు రూ.లక్ష ఖర్చు చేస్తున్న వీరికి అధిక వర్షాలు నష్టం కలిగించాయన్నారు. ధర సైతం లేక మరింత నష్టం జరుగుతుందన్నారు. పచ్చి మిర్చి రైతులకు ఆదుకునే చర్యలు చేపట్టాలని కోరారు. రాజు, చిన్నమాదులు, వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, బాలయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పొట్టేళ్ల అపహరణ

కృష్ణగిరి: మండలంలోని పోతుగల్లు గ్రామంలో గురువారం తెల్లవారుజామున గ్రామానికి చెందిన కరివేముల పాపయ్యకు చెందిన పొట్టేళ్లను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. గ్రామ శివారులోని వాముదొడ్డిలో ఉన్న 8 పొట్టేళ్లను దుండగులు బొలేరో వాహనంలో వచ్చి అపహరించుకెళ్లినట్లు బాధితుడు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మల్లికార్జున మాట్లాడుతూ పొట్టేళ్లు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదు వచ్చిందని అనుమానిత వ్యక్తులను తీసుకొచ్చి విచారిస్తున్నామన్నారు. త్వరలోనే దుండగులను గుర్తిస్తామన్నారు. దాదాపుగా రూ.లక్ష విలువజేసే పొట్టేళ్లను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు.